## క్లుప్తంగా

### విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



అమరావతి: విద్యార్థులు కష్టపడి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు అన్నారు. మండలంలోని మల్లాది జెడ్పీ హైస్కూలులో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలని, అందు కోసం క్రమశిక్షణ అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లాది వైఎస్సార్ సీపీ నాయకుడు వెంపా వాసు పాల్గొన్నారు.

### ఈ- పంట నమోదుపై సామాజిక తనిఖీలు

నకరికల్లు: రబీలో 2024-25 సంవత్సరానికి గాను ఈ పంట నమోదుపై సామాజిక తనిఖీ జరుగుతుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. రైతుల వివరాలు, సాగు చేస్తున్న పంటల వివరాలు, విస్తీర్ణంపై జాబితాను రైతు సేవా కేంద్రాల్లో సోమవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితా ఈ నెల 22 వరకు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే రైతులు రాతపూర్వకంగా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది ద్వారా తెలపాలని ఆయన సూచించారు. వ్యవసాయ సహాయకుడు వై.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

### నేడు కొండమోడులో ఉచిత వైద్య శిబిరం

సత్తెనపల్లి: గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కొండమోడులోని క్వారీ రోడ్డులో మంగళవారం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు సోమవారం తెలిపారు. శిబిరంలో గుండె, ఎముకలు, కీళ్ల, థైరాయిడ్, నెమ్ము, బీపీ, షుగర్, ఆయాసం, కళ్లు తిరగడం, వాంతులు తదితర వ్యాధులకుపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

### దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రం తనిఖీ

సత్తెనపల్లి: సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో సందర్శించారు. పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు ఆమె సూచనలు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కూడా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో చంద్రకళ తెలిపారు.


### గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బెల్లంకొండ: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి నజీర్ సూచించారు. 'ప్రధాన్ మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశు సంరక్షణ కార్డులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రామానికి చెందిన బంకా మహేష్ సహకారంతో సత్తెనపల్లి, హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మహేష్ చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటూనే సామాజిక బాధ్యతగా చిన్న సహాయాన్ని అందచేశారని తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. అనంతరం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహేష్‌బాబు తండ్రి నాన్నయ్య, సత్తెనపల్లి ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్, టీచర్ మస్తాన్, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కవిత, సరిత, విజయలక్ష్మి, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇద్దరికీ నారీరత్న అవార్డుల ప్రదానం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఇద్దరు మహిళలకు నారీరత్న-2025 అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ గాంధీనగర్‌లోని ఆశిష్ ఫంక్షన్ హాలులో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్, సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన వివిధ రంగాల్లో ప్రతిభామూర్తులకు అవార్డులను అందించారు. ఇందులో సాహిత్య రంగంలో సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు, రచయిత డాక్టర్ సరికొండ రమాదేవి, సామాజిక సేవలో మేడూరి శ్రీలక్ష్మికి నారీ రత్న అవార్డులతో పాటు మెమెంటో, సర్టిఫికెట్, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

# విద్యార్థుల భవితతో కూటమి ఆటలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థిలోకం ఆవేదన
- నిరుద్యోగభృతి, ఉద్యోగాలు ఎక్కడ?
- యువత పోరును జయప్రదం చేయండి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈ నెల 12న నిర్వహించే యువత పోరును జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉంటే రూ.700 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించ కపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. ఒత్తిడి తట్టుకోలేక పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. . 2014-19 టీడీపీ హయాంలో పెండింగ్‌లో ఉన్న రూ.1,900 కోట్ల బకాయిలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించిందన్నారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాలనలో ఉన్నత విద్యకే రూ.26 వేల కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చినా బడ్జెట్‌లో కేటాయింపులే లేవని భార్గవ్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో కొత్తగా 16 వైద్య కళాశాలలు మంజూరు చేయిస్తే.. కొత్తవి అవసరం లేదని కేంద్రానికి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి నిధులు విడుదల చేయాలని, వైద్య కళాశాలల సంఖ్యను కుదించరాదని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న యువత పోరు పేరుతో నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. యువత పోరులో నియోజకవర్గంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబురావు, రమావత్ కోటేశ్వరరావు నాయక్, ఎంజీ ఎం రామలింగారెడ్డి (చిన్నా), షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, నక్కా శ్రీనివాసరావు, కళ్లం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా యువత పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుజ్జర్లపూడి సతీష్, అచ్యుత శివప్రసాద్, చిలుకా జైపాల్, ఫెూరా, గంటా ఏసుబాబు, లోకా మాధవ, రెండెద్దుల వెంకటేశ్వర రెడ్డి, పెద్దింటి.వెంకటేశ్వర్లు(చిట్టి), వరికల్లు. కోటేశ్వరరావు, బండి మల్లికార్జునరెడ్డి, సంకుల తిరుమలరావు పాల్గొన్నారు.

## వైభవంగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల



విశేష అలంకరణలో స్వామి

నకరికల్లు: మండలంలోని రూపెనగుంట్లలో గల శ్రీ వీరాంజనేయస్వామి 53వ వార్షిక తిరునాళ్లను సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు నారాయణం రాధాకృష్ణమాచార్యులు, వెంకట కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు చేశారు. పంచామృత స్నపన తదితర అభిషేకాల అనంతరం విశేషంగా అలంకరించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి, స్వామికి సమర్పించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రూరల్ సీఐ ఎం.వి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

## వైభవంగా శత చండీ మహా యాగం



పట్టణంలోని త్రిశక్తి దుర్గా పీఠంలో యాగం నిర్వహణ

సత్తెనపల్లి: పట్టణంలోని భవిష్య పాఠశాల సమీపంలో గల త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్టా బ్రహ్మ, విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక కోశాధికారి హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో పంచాయతన పూర్వక నవదుర్గాత్మక శత చండీ మహాయాగాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. చండీ పారాయణం, శత చండీ హోమం, గురు వందనం, ప్రధాన దేవతా అర్చన, లలిత సహస్ర నామార్చన, దీపార్చన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. రుద్ర, మృత్యుంజయ, ధన్వంతరి హోమాలతో పాటు చతుర్వేద సేవ నిర్వహించారు.ఏర్పాట్లను గణేష్ యువ సేన, త్రిశక్తి దుర్గాపీఠం బ్రహ్మోత్సవ కమిటీ, త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి బాధ్యులు పర్యవేక్షించారు.

## హైస్కూలుకు ఎయిర్ కూలర్లు బహూకరణ



పెదకూరపాడు : మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం జి.శివసుందర్‌రెడ్డి సోదరుడు జి.వి.శివారెడ్డి మూడు ఎయిర్ కూలర్లను బహూకరించారు. పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్‌కు వేసవిలో ఇబ్బంది పడకుండా, ప్రస్తుతం నిర్మిస్తున్న లైబ్రరీ రూంలో ఉపయోగించడానికి వీలుగా వీటిని అందజేశారు. గతంలో కూడా పాఠశాల అభివృద్ధికి ఎంతో కృషి చేసిన శివసుందరరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరెడ్డి, పీసీ చైర్మన్ జి.పున్నారావు, జి.శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. దాతకు పాఠశాల యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది.

## సావిత్రీబాయికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: బడుగు, బలహీనవర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని బీసీ సంఘాల నాయకులు కొనియడారు. సావిత్రీబాయి పూలే 128వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని ఎన్జీవో హోం సెంటర్‌లో బీసీ సంఘాల నాయకుడు యర్రగొర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోని తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా మహిళలకు విద్య అందించిన మహా సుభావురాలు అని కొనియాడారు. భర్త జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో నడిచి అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలను నడిపించిన ఘనత ఆమెకే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కంటు వెంకట్రామయ్య, కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మరావు, బెల్లంకొండ వెంకటచెన్నయ్య, పిక్కిలి రత్తయ్య, ఆరుద్ర వెంకట్రావు, షేక్ చిన్న షరీఫ్, పులహరి బానోజీ, ధావల వెంకటేశ్వర్లు, పిక్కిలి శివ, మునుగోటి ప్రసాద్, లింగాలరాజు. గుంటూరు గోవిందు, నల్లగొర్ల రామయ్య, గరికపాటి బెన్ని బాబు, చింతపల్లి లాజరు పాల్గొన్నారు.

## రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అరుణ

నార్నెపాడు(ముప్పాళ్ల): రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి పెట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని నార్నెపాడులో సోమవారం వ్యవసాయశాఖ, వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ పంటకు ముందుగా పొలంలో పీఎండీఎస్ (నవ ధాన్య విత్తనాలు) చల్లాలని సూచించారు. దీనివల్ల భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెందడంతో పాటు కర్బన శాతం చేరడంతో పశువులకు మేతగా కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నందకుమార్ మాట్లాడుతూ ప్రతి యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో గల రైతును ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకెళ్లాలని చెప్పారు. ప్రతి ఒక్కరికీ కిచెన్ గార్డెన్ ఉండే విధంగా చూడాలని చెప్పారు. అంతర పంటల విధానం ఆచరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్య సాగుచేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు కొర్రపాటి కృష్ణ, కంభంపాటి విజయ్ సన్మానించారు. ఐకేపీ సీసీ సౌభాగ్యం, జిల్లా సిబ్బంది సౌజన్యలక్ష్మి, స్వాతి, డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుబాబు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కె.పూజ, యానిమేటర్స్ పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

క్రోసూరు: స్థానిక ప్రధాన రహదారిపై చెరువుకట్ట వద్ద 32 అడుగుల శ్రీ అభయాంజనేస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకుని గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. తాళ్లాయపాలెం, శైవ క్షేత్రం పీఠాధిపతులు శివస్వామి చేతుల మీదుగా అభయాంజనేస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భారీఎత్తున అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా విద్యుత్ దీపాలను గ్రామం వరకు అలంకరించారు.

### మహిళల రక్షణకు పలు చట్టాలు

సత్తెనపల్లి: మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన కార్యాలయం (మెప్మా)లో ఆర్పీలతో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టాలపై డ్వాక్రా మహిళలతో పాటు ఇతర మహిళలను చైతన్య పరచాలని తెలిపారు. న్యాయ సేవాధికార కమిటీ విధులు, లోక్ అదాలత్, లింగ నిర్ధారణ, చట్టం, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహ హింసా చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో పట్టణ పేదరిక నిర్మూల సంస్థ కో-ఆర్డినేటర్ ఖాజ, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, షేక్ ఖాజ, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మాదల(ముప్పాళ్ల): వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మహిళ, రోడ్డు ప్రమాద బాధితుడు మృతి చెందిన సంఘటనలు సోమవారం జరిగాయి. మండలంలోని మాదల గ్రామానికి చెందిన బెల్లం మహాలక్ష్మమ్మ(47) ఈ నెల 3న జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందినప్పటికీ తగ్గక పోవడంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికీ తగ్గకపోవటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గుండె నొప్పితో మృతి చెందినట్లుగా వైద్యులు చెబుతున్నారు. అయితే, ఆమె అరుదైన జీబీఎస్ లక్షణాలతో మృతి చెందినట్లుగా ప్రచారం జరుగుతోంది.

సత్తెనపల్లిలో...

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొండపనేని నాగమల్లేశ్వరరావు(45) రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలోని వైన్ షాప్‌లో గుమస్తా గా పని చేస్తున్నాడు. గత నెల 23న విధులు ముగించుకుని తిరిగి సత్తెనపల్లి వస్తున్న క్రమంలో ధూళిపాళ్ల సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు కొండపనేని శ్రీహరి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


### పశువులకు వ్యాక్సిన్లు

క్రోసూరు : జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాల సందర్భంగా సోమవారం మండలంలోని బాలెమర్రు, ఆవులవారిపాలెం గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించినట్లు మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య తెలిపారు. బాలెమర్రులో 300, అనంతవరంలో 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెలాఖరు వరకు నిర్వహించనున్న వైద్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### ఇంటర్ పరీక్షకు 103 మంది విద్యార్థులు గైర్హాజర్

సత్తెనపల్లి: పట్టణంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు 103 మంది విద్యార్థులు సోమవారం గైర్హాజరయ్యారు. పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం గణితం -2బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు జనరల్ విభాగంలో 912 మందికి గానూ 832 మంది హాజరయ్యారు. 80 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 209 మందికి గానూ 186 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు.అన్ని పరీక్ష కేంద్రాల్లో స్క్వాడ్ బృందాలు తనిఖీలు జరిపాయి.

## సీపీఐ నేత గురవయ్యకు ఘన నివాళి



గురవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: ఏపీ రైతు సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, ఏపీ సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ మాజీ కార్యదర్శి కామ్రేడ్ నరిశేటి గురవయ్యకు నేతలు ఘన నివాళులర్పించారు. పట్నంలోని లెనిన్ నగర్‌లో సోమవారం గురవయ్య విగ్రహం వద్ద ఏడవ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదర్శ కమ్యూనిస్టు నేతగా పేద ప్రజల గుండెల్లో గురవయ్య బతికే ఉన్నారని తెలిపారు. గురవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కామ్రేడ్ సునీత, బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వడ్డవల్లిలోని మాతృశ్రీ మొల్లమాంబ ఆశ్రమంలో వృద్ధులకు నరిశేటి తాండవ కృష్ణ ఆర్థిక సహాయంతో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో పలువురు సీపీఐ నేతలు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డేపై అధికారుల నిర్లక్ష్యం



అమరావతి తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు హాజరైన అధికారులు

అమరావతి: గ్రీవెన్స్ డేపై అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో ప్రజలకు కూడా ఆసక్తి తగ్గుతోంది. మండల స్థాయి అధికారులు కొంతమంది గ్రీవెన్స్‌డే గురించి పట్టించుకోవటం లేదని విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు సంతకాలు చేసి, కాసేపు కూర్చొని వెళుతున్నారు. మరి కొందరు తమ కింది స్థాయి సిబ్బందిని పంపుతున్నారు. సోమవారం పద్దెనిమిది మండల శాఖ అధికారులు రావాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. అధికారులు జిల్లా కేంద్రం నుంచి వచ్చే సూచనలు, ఆదేశాల మేరకే సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తప్పా మండల స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం అంతంతమాత్రంగానే ఉంది.

క్రోసూరులో..

కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.వి. నాగరాజు తెలిపారు. నాలుగు రెవెన్యూ సమస్యలపై , రెండు పుట్టిన తేదీ నమోదు కోసం వచ్చినట్లు చెప్పారు. అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ధనలక్ష్మి తెలిపారు. వాటిని వెంటనే పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

సత్తెనపల్లిలో

సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పట్టణం, మండలం నుంచి 11 సమస్యలు వచ్చినట్లు తహసీల్దార్ కె.ఎస్. చక్రవర్తి తెలిపారు. వాటిని ఆయా శాఖల అధికారులకు పంపి త్వరితన పరిష్కరించాలని సూచనలు చేసినట్లు చెప్పారు.

## ఆస్పత్రిలో మౌలిక వసతులు కరువు



అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విద్య

పెదకూరపాడు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ తొలి సమావేశం సోమవారం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరుకాలేదు. దీంతో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ విద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమస్యలను ఆమె కమిటీ దృష్టికి వైద్యులు తీసుకొచ్చారు. వైద్యశాలను రూ.8.6కోట్లతో నిర్మించినా వసతులు అందుబాటులోకి రాలేదని తెలిపారు. పాత వైద్యశాలలో పెచ్చులు ఊడుతున్నాయని, రోగుల వివరాలు పొందుపర్చేందుకు కంప్యూటర్లు లేవని కమిటీ దృష్టికి తెచ్చారు. ఆపరేటర్లు అవసరమని, వైద్యులకు సరిపడా కుర్చీలు, టేబులు లేవని ఆమె తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతుకు రాబడి



రైతులకు సూచలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ప్రేమ్‌రాజ్

నకరికల్లు: ప్రకృతి వ్యవసాయంతో రైతుకు ఖర్చు తగ్గి, రాబడి పెరుగుతుందని ఆ విభాగం జిల్లా మేనేజర్ ప్రేమ్‌రాజ్ అన్నారు. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం, కార్యాచరణ ప్రణాళిక- 2025 అనే అంశంపై అవగాహన సదస్సును సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, వెలుగు, ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని ఆహార ఉత్పత్తులు తినడం ద్వారా ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేసవిలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా గుళికల విధానాన్ని డెమో ద్వారా వివరించారు. 30రకాల విత్తనాలను ప్రదర్శించారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌లో రైతులంతా పంటకు ముందుగా నవ ధాన్య విత్తనాలు చల్లడం ద్వారా చీడపీడలు ఆశించకుండా రోగాలను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో నాలుగేళ్ల పైబడి నవధాన్యాల సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీసీ కనకారావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.అప్పలరాజు, డివిజన్ మాస్టర్ ట్రైనర్ బాజీబాబు, డీఎం ఎంటీలు కె.రవికుమార్, హసీనా, యూనిట్ ఇన్‌చార్జిలు రామసుబ్బారెడ్డి, రేణుకాదేవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, సెరీ కల్చర్ అధికారి యాకూబ్, వీఓఏలు, వీఏఏలు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో తల్లీబిడ్డా క్షేమం



పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ విద్య, మాగులూరి పౌండేషన్ సభ్యులు

పెదకూరపాడు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ఎంతో అవసరమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండ్ంట్ డాక్టర్ విద్య తెలిపారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్య మాట్లాడుతూ నాలుగేళ్లుగా మాగులూరి ఫౌండేషన్ అధ్వర్యంలో ప్రతి నెలా పౌష్టికాహారం అందించడం అభినందనీయమని తెలిపారు. పౌష్టికాహారంతో తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు సురక్షితమన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో అనేక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అంద్ర ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు షేక్ ముంతాజ్, మాగులూరి ఫౌండేషన్ సభ్యులు కుంచనపల్లి కిరణ్‌కుమార్, మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాద్ పాల్గొన్నారు.

## పాలిథిన్ కవర్ల విక్రయాలను తక్షణమే ఆపాలి

మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

సత్తెనపల్లి: నిషేధిత పాలిథిన్ విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ ఆనంద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పాలిథిన్ వస్తువుల హోల్‌సేల్ అమ్మకందారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిథిన్ క్యారీబ్యాగులు (120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలవి), పాలిథిన్ షీట్స్, ప్లాస్టిక్ పీవీసీ బ్యానర్లు (100 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలవి), థర్మో కోల్స్, పాలిథిన్ ప్లేట్స్, గ్లాసులు, కప్పులు, ప్లాస్టిక్ జెండాలు తదితర అమ్మకాలను ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. దీనికి విరుద్ధంగా అమ్మకాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అవసరమైతే వ్యాపార సంస్థల మూసివేతకు కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. విజయ సారథి పాల్గొన్నారు.

### వైభవంగా భావనాఋషి, భద్రావతిదేవి కల్యాణం

అమరావతి: స్థానిక సాలిపేటలోని శ్రీ భద్రావతీ సమేత భావనా ఋషి మందిరంలో ఆదివారం రాత్రి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామిని ఉంచి సంప్రదాయబద్ధంగా గణపతి పూజ, పుణ్యాహవాచన, నవగ్రహ మండపారాధన అనంతరం భద్రావతి, భావనాఋషి కల్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమానంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com